ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

చల్లపల్లి: స్థానిక ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పూర్వ విద్యార్థులు జీఎన్‌వీ ప్రసాద్, యర్రంశెట్టి సుబ్బారావు, శివకుమార్, నెహ్రూ, పిచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి వాలీబాల్ క్రీడాకారులు తరలివచ్చి పోటీల్లో పాల్గొన్నారు. విజేతగా నిలిచిన మచిలీపట్నం జట్టుకు కళాశాల పీఈటీ గొర్రెపాటి శ్రీనివాసరావు రూ.10వేలు, రన్నర్‌గా నిలిచిన అవనిగడ్డ జట్టుకు జీఎన్‌వీ ప్రసాద్ రూ.8 వేలు, మూడో స్థానంలో నిలిచిన చల్లపల్లి ఏ జట్టుకు అవనిగడ్డకు చెందిన గరికిపాటి సాంబశివరావు రూ.5 వేలు అందజేశారు.

వరి కుప్ప దగ్ధం

బంటుమిల్లి: అర్తమూరు గ్రామానికి చెందిన కౌలు పొలంలోని వరి కుప్పకు గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి నిప్పుపెట్టారు. సాతులూరు గ్రామానికి చెందిన గుజ్జు సీతారామ్మూర్తి అర్తమూరుకు చెందిన కాగిత రాజశేఖర్‌కు చెందిన భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. రెండో పంటగా మినుము విత్తనాలు చల్లి ఈ నెల 13వ తేదీ రాత్రి వరికుప్ప తొక్కించి కూలీలు, కౌలు రైతు ఇంటికి వెళ్లారు. వారు ఇళ్లకు వెళ్లిన గంట లోపే కుప్పకు మంటలు అంటుకోవడంతో దగ్ధమైంది. సుమారు రూ. 25 వేల విలువ చేసే గడ్డి, ధాన్యం కాలిపోయాయి.

విజేతలకు బహుమతుల ప్రదానం

మోపిదేవి: సంక్రాంతి సందర్భంగా మోపిదేవిలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు శనివారం అందచేశారు. ముగ్గుల పోటీల్లో ప్రథమస్థానం సాధించిన మహిళకు కలర్ టీవీ, ద్వితీయ, తృతీయ స్థానం పొందిన మహిళలకు గ్రైండర్, నాలుగో స్థానంలో నిలిచిన వారికి మిక్సీ, ఐదో స్థానం మహిళకు కుక్కర్‌తో పాటు పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ కన్సోలేషన్ బహుమతులుగా కుక్కర్లు అందజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

పెడన: అగ్ని ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధురాలు శనివారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత బల్లిపర్రు రోడ్డు మార్జిన్‌లో పూరి గుడిసెలో నివాసం ఉంటున్న ముద్దినేని సావిత్రి (70) శుక్రవారం మధ్యాహ్నం వంట చేస్తుండగా చీరకు నిప్పు అంటుకుని తీవ్రంగా గాయపడింది. ఆమె మచిలీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతిచెందింది. ఎస్ఐ రవిచంద్ర కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మండలంలోని మడక గ్రామంలో నివాసం ఉంటున్న గంజాల బ్రహ్మయ్య(45) శుక్రవారం రాత్రి రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మచిలీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమనీయం.. గోదా రంగనాథుని కల్యాణం

అవనిగడ్డ: స్థానిక గీతా మందిరంలో భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదా రంగనాథుని కల్యాణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. దీవి వెంకట రామ శ్రీనివాస్ బ్రహ్మత్వంలో అర్చకులు దీవి నరసింహ మూర్తి, మనోజ్ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. పలు ప్రాంతాల భక్తులు కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త యర్రంశెట్టి శ్రీహరి, రాము పర్యవేక్షించారు.

- **చల్లపల్లి:** స్థానిక గరుడ ఆంజనేయ సహిత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం ధన్వంతరాచారి ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలు నూజెళ్ల బాబు, బొందలపాటి వెంకటేశ్వరరావు, ఉప్పాల ఏడుకొండలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. గీతామందిరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోదా – శ్రీకృష్ణుల కల్యాణ వేడుకలు వేద పండితులు లంక చక్రపాణిచే ఘనంగా నిర్వహించారు.
- **మచిలీపట్నంటౌన్:** ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా నగరంలోని రంగనాయక స్వామి దేవస్థానం, వేణుగోపాలస్వామి ఆలయాల్లో గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కొప్పల ఫణిమోహన్, సుస్మిత, సుంకర మధు ఆంజనేయ వర ప్రసాద్, శైలజ దంపతులు పీటలపై కూర్చున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది. ఉదయం ఆలయంలో గోదాదేవి అమ్మవారి నీలాటి రేవు ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం చిన్నారులకు భోగిపండ్ల పేరంటం కార్యక్రమం జరిగింది. చిన్నారులను వారి తల్లిదండ్రులు ఆలయానికి తీసుకువచ్చి భోగిపండ్లు పోయించారు. కార్యక్రమాలను రంగనాయకస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి తిక్కిశెట్టి వీరవెంకటమోహనరావు, రామలింగేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ దేసు వెంకట సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.



అవనిగడ్డ గీతా మందిరంలో గోదా రంగనాథుని కల్యాణ మహోత్సవం



బందరు రంగనాయకస్వామి ఆలయంలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న దృశ్యం

- **బంటుమిల్లి:** స్థానిక పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం గోదాదేవీ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పండితులు పవన్, సాయిల వేద మంత్రాల మధ్య కల్యాణం జరిగింది. పలు గ్రామాలకు చెందిన దంపతులు పాల్గొని స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్. రాజ, సభ్యులు పాల్గొన్నారు.

జ్యోతి దర్శనంతో భక్తుల పులకింత

కోడూరు: అపర శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్ప స్వామివారి దేవాలయంలో శనివారం రాత్రి మకరజ్యోతి దర్శన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో పెద్దమొత్తంలో కర్పూరాన్ని జ్యోతిగా వెలిగించి భక్తులకు దర్శనమందించారు. ఉదయం అయ్యప్ప మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలను నిర్వహించారు. సాయంత్రం స్వామివారి నగల ఊరేగింపు జరిగింది. ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో ఉత్సవాలు జరగ్గా, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- **మచిలీపట్నంటౌన్:** గాంధీబొమ్మ శివాలయం ఆవరణలోని అయ్యప్ప దేవాలయంలో శనివారం జ్యోతి దర్శన ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం లక్ష్మీగణపతి హోమం జరిగింది. సాయంత్రం స్వామివారి ఆభరణాల ఊరేగింపు, సర్వాభరణం అలంకారం, సువర్ణపుష్పార్చన, జ్యోతిదర్శనం, భజన కార్యక్రమాలు నిర్వహించారు.



ఆలయంపై వెలుగుతున్న కర్పూర మకర జ్యోతి

విజేతలకు బహుమతుల ప్రదానం

గుడ్లవల్లేరు: సంక్రాంతిని పురస్కరించుకుని షిరిడీ సాయి మందిర మహిళా నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలను ఎంపిక చేసి ప్రోత్సాహ బహుమతులను డీటీ బి.కనకదుర్గ చేతుల మీదుగా అందజేశారు. మందిర అభివృద్ధి కమిటీ చైర్మన్ కానూరి బాలకృష్ణమోహన్(బాలు) ఆర్థిక సాయంతో గృహోపకరణాలను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ

బంటుమిల్లి: మణిమేశ్వరం గ్రామం రాజుల కాలనీలో ఏర్పాటు చేసిన మన్యంవీరుడు అల్లూరు సీతారామరాజు విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. గ్రామస్తులు అందరు కలిసి గ్రామ కూడలి వద్ద మందిరం నిర్మించి అందులో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డి. మధుసూదనరావు, వి. కేశవరాజు, కిరణ్‌కుమార్, కె. ప్రసాదరాజు, ఎం. బాబు, సభ్యులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్



చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో జరిగిన వివాదంలో దాడికి పాల్పడిన నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిలకలపూడి సీఐ ఎస్. రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13వ తేదీన నగరంలోని రెస్టారెంట్‌లో జరిగిన వివాదంలో నిందితులు శరత్‌కుమార్, వినీత్‌కుమార్, వీరాంజనేయులు, దత్తను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆకట్టుకున్న రంగవల్లులు

రావివారిపాలెం(మోపిదేవి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఇంటింటా తెలుగుదనం ఉట్టిపడింది. ప్రతి ఇంటా రంగురంగుల రంగవల్లులు ఆకర్షణీయంగా దర్శనమిచ్చాయి. రావివారిపాలెంలో రాంబాబు ఇంటి వద్ద వేసిన సంక్రాంతి ముగ్గులో ధనుర్మాసం సందర్భంగా రాధాకృష్ణ బొమ్మతో పాటు ఇరువైపులా దీపం కుందెలు, కింది వరుసలో పొంగళి, రైతుల ఎడ్లబండి, కొండపల్లి బొమ్మలతో అందంగా అలంకరించారు.

ఇంటింటా భోగి వేడుకలు



- భారీ భోగి మంటలతో సందడి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అవనిగడ్డ: అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో భోగి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భారీ భోగి మంటలు వేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. దివిసీమలో ప్రజలు తెల్లవారు జామునే లేచి కొన్ని ప్రాంతాల్లో భారీ భోగిమంటలు వేశారు. మండల పరిధిలోని బందలాయిచెరువులో యూఎస్‌బీ యూత్ ఆధ్వర్యంలో 30 అడుగుల మేర భారీ భోగి మంటలు వేశారు. అవనిగడ్డ గరల్స్ హైస్కూల్, దామెర్ల బజార్, సంతబజార్, ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాల ప్రాంగణం, పోలీస్ స్టేషన్ ముందు భారీ భోగి మంటలు వేశారు. కొంతమంది యువకులు భోగి మంటలపై నుంచి దూకి సందడి చేశారు. భోగి మంటల్లో కాచిన నీటితో పుణ్యస్నానాలు ఆచరించి కొత్త దుస్తులు ధరించి వేడుకలు చేసుకున్నారు.

పెడన: బంటుమిల్లి రోడ్డులోని గణేష్ నగర్, అగస్త్రేశ్వర స్వామి శివాలయం, 14వ వార్డు తదితర ప్రాంతాల్లో యువకులు భోగి మంటలు వేశారు. చిన్నారులు, విద్యార్థులు బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి పూజలు చేశారు. చిన్నారులకు భోగిపండ్లను పోశారు. వాకిట్లలో రంగవల్లులను తీర్చిదిద్దారు. పట్టణంలోని శ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రావణబ్రహ్మ వాహనంపై ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కోడూరు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మొదటి రోజు భోగి వేడుకలను మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం ఇంటింటా భోగి మంటలు వేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. ఇళ్ల ముందు భోగిమంటలు వేసి, వాటి వద్ద ఇంటిల్లిపాది సందడి చేశారు. ఇంటి ముందు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. కోడూరు వెంకన్న ఆలయంలో సంప్రదాయబద్ధంగా భోగిమంటలు వేశారు. మహిళలు భోగిమంట చుట్టూ స్వామి వారి కీర్తనలు ఆలపిస్తూ భజనలు చేశారు. యువత పెద్దపెద్ద భోగి మంటలు వేసి వాటి వద్ద కేరింతలు కొడుతూ ఉల్లాసంగా గడిపారు. పలువురు నివాస గృహాల్లో బొమ్మల కొలువులను ముచ్చటగా ఏర్పాటు చేశారు.


కోడూరు వెంకన్న ఆలయం వద్ద భోగిమంటల వద్ద మహిళల సందడి


బందరులో భోగిమంట వద్ద ఎమ్మెల్యే పేర్ని నాని

- **పెడన:** సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పైడమ్మ దేవస్థానం ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లులు, విచిత్ర వేషధారణలు, మ్యూజికల్ చైర్, నృత్యాలు, పాటలు, మెహందీ పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.
- **నాగాయలంక:** శ్రీరామపాదక్షేత్రం, గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో కృష్ణాతీరంలోని కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో భోగి మంటలు వేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీ జరిగింది. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. గ్రామంలోని సాయి మెస్ అధినేత చుండూరు నరసింహారావు ఆధ్వర్యంలో తెల్లవారుజామున భారీ భోగి మంటను వేశారు.
- **కృత్తివెన్ను:** మండలంలో భోగి వేడుకలను శనివారం వైభవంగా జరుపుకున్నారు. వేకువజామునే పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా సందడి చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోయడం, బొమ్మల కొలువులతో రోజంతా ప్రజలు సందడిగా గడిపారు.
- **బంటుమిల్లి:** మండల ప్రజలు శనివారం భోగి పండుగను జరుపుకున్నారు. ఇళ్ల ముందు అందమైన రంగులు, పూలతో రంగవల్లులు తీర్చిదిద్ది, గొబ్బెమ్మలు పెట్టి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గృహాల్లో బొమ్మలు కొలువు తీర్చి చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. గ్రామ, గ్రామాన తెల్లవారుఝామున యువకులు వీధుల్లో పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు.
- **మచిలీపట్నంటౌన్:** ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని), ఆయన సతీమణి పేర్ని జయసుధ, కుమారుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) తమ గృహం వద్ద భోగిమంట వేశారు. పేర్ని నాని మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు భోగభాగ్యాలు కలగాలని, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రామానాయుడుపేట సెంటర్‌లో అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున భోగిమంట వేశారు. కార్యక్రమంలో పేర్ని కిట్టు, నాయకులు పాల్గొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో వారి గృహాల ముందు కర్రలను, పాత వస్తువులను ఉంచి భోగి మంటలు వేసి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. నగర శివార్లలో సంప్రదాయబద్ధంగా కోడిపందేలు వేశారు.


బందలాయి చెరువులో భారీ భోగి మంట


జానకీరామపురంలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు

సంప్రదాయబద్ధంగా కోడిపందేలు

బంటుమిల్లి: మండల పరిధిలోని బంటుమిల్లి, పెందుర్రు, ములపర్రు, అర్తమూరు, మణిమేశ్వరం, నాగేశ్వరరావుపేట, రామవరపుమోడి గ్రామాల్లో సంప్రదాయబద్ధంగా కోడి పందేలు వేశారు. గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మరియతల్లి విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేసిన పేర్ని కిట్టు

చిలకలపూడి(మచిలీపట్నం): పెదపట్నం పంచాయతీలోని ఆర్‌సీఎం చర్చి కాంపౌండ్‌లో మరియతల్లి విగ్రహ గుహ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శనివారం శంకుస్థాపన చేశారు. రూ. 4 లక్షల వ్యయంతో ఈ నిర్మాణాన్ని చేపట్టామని సర్పంచ్ గడిదేశి అనూషరాజ్ తెలిపారు. అనంతరం పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన ఇళ్ల స్థలాల పట్టాలను లబ్ధిదారులకు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) చేతుల మీదుగా అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గడిదేశి రాజు పాల్గొన్నారు.



































